# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 140 | శుక్రవారం 23, జనవరి 2026 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

**ఎన్‌కౌంటర్‌లో 15 మంది నక్సల్స్ మృతి.**
**మావోయిస్టుల ఏరివేత ముమ్మరం**
**సారండా అడవుల్లో భద్రతా దళాల వేట**
**2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలన్నది కేంద్రం లక్ష్యం**

**ఝార్ఖండ్ జనవరి 22(ప్రజాస్వ-రం):**
ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. సింగ్‌భూం జిల్లాలో భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో

..మిగతా 2లో





# మినీ ప్రపంచ ఆర్థిక సదస్సుకు హైదరాబాద్ వేదిక

**ఫాలోఅప్ సదస్సు నిర్వహణకు ఫోరం ప్రతినిధుల హామీ**
**నిర్ణయాల పురోగతిని సమీక్షకు సదస్సు దోహదపడుతుందని వ్యాఖ్య**
**కీలక ప్రతినిధులతో సీఎం బృందం భేటీ**
**ఇప్పటికే చైనాలో సమ్మర్ దావోస్.. ఆసక్తి కనబరుస్తోన్న సౌదీ అరేబియా**
**ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్**
**శంషాబాద్ , గాగిల్లాపూర్ లో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ..**

**ప్రజాస్వరం దావోస్ :**
రైజింగ్ తెలంగాణ 2047 విజన్‌తో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా దూసుకుపోతున్న తెలంగాణకు మరో కీలక అంతర్జాతీయ వేదిక దక్కనుంది. ఏటా జనవరిలో దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు అనంతరం ఫాలోఅప్ సమావేశంగా హైదరాబాద్‌లో 'మినీ దావోస్' సదస్సు నిర్వహించేందుకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. జూలై లేదా ఆగస్టు నెలల్లో హైదరాబాద్‌లో ఈ సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించగా, ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, డిజిటల్ ఎకానమీ స్ట్రాటజీ హెడ్ మంజు జార్జ్ దీనిపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దావోస్ సదస్సులో తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఈ ఫాలోఅప్ సమావేశం దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందం డబ్ల్యూఈఎఫ్ ప్రతినిధులతో భేటీ అయింది. తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలు, ప్రోత్సాహకాలను ప్రపంచానికి పరిచయం చేయాలని సీఎం ఆకాంక్ష వ్యక్తం చేశారు. బయోఏషియా-2024లో

..మిగతా 2లో

## రోహిత్ శర్మకు డాక్టరేట్

**పుణేలోని అజింక్య డీవై పాటిల్ యూనివర్సిటీ నుంచి సత్కారం**
**క్రికెట్‌కు చేసిన సేవలకు, నాయకత్వానికి గుర్తింపుగా ఈ పురస్కారం**
**శనివారం జరగనున్న స్నాతకోత్సవంలో ప్రదానం చేయనున్నారు**



02

## హైడ్రా నెక్స్ట్ టార్గెట్..

**450 ఏళ్ల కటోరా హౌజ్ పునరుద్ధరణ.!**
**గోల్కొండలో 450 ఏళ్ల జలవనరుకు నూతన జీవం**
**పర్యాటక, పర్యావరణ పరిరక్షణకు కలిసి చర్యలు**
**చారిత్రక జలవనరుల సంరక్షణపై ప్రభుత్వ దృష్టి**



03

## బీసీ నేత సీఎం అయ్యే సమయం వస్తుంది

**అవకాశం ఉన్న ప్రతి చోట బీసీలకు పదవులు ఇస్తున్నామన్న మహేశ్ గౌడ్**
**మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యమని వెల్లడి**
**దేవుళ్ల పేరుతో రాజకీయాలు మంచిది కాదని వ్యాఖ్య**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ నేత ముఖ్యమంత్రి అయ్యే ఆ సమయం తప్పకుండా వస్తుందని అన్నారు. ముమ్మందు బీసీలకు మరిన్ని అవకాశాలు

..మిగతా 2లో

## సింగరేణి టెండర్లపై దర్యాప్తు చేపట్టాలి

**2014 నుంచి ఇప్పటి వరకు టెండర్లపై విచారణ జరగాల్సిందే**
**సీబీఐనీ రాష్ట్రంలో రానీయకుండా చేసిందెవరూ..?**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**



02

## రేవంత్ రెడ్డికి, సైబర్ నేరగాడికి పెద్ద తేడా లేదు

**ప్రజల ఖాతాల నుంచి రేవంత్ డబ్బులు తీసుకుంటున్నారన్న హరీశ్**
**హామీలపై మంత్రులను ప్రజలు నిలదీస్తున్న పరిస్థితి ఉందని వ్యాఖ్య**
**డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సిట్ నోటీసులు జారీ కావడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి ప్రవర్తనకు, ఒక సైబర్ నేరగాడి ప్రవర్తనకు పెద్ద తేడా లేదంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజల కోసం ఖజానా నుంచి డబ్బులు ఖర్చు చేశామని, కానీ రేవంత్‌రెడ్డి మాత్రం ప్రజల ఖాతాల నుంచే డబ్బులు తీసుకుంటానంటున్నారని

..మిగతా 2లో

## ఫోన్ ట్యాపింగ్ లో కేటీఆర్ కు నోటీసులు

**నేడే విచారణకు రావాలని ఆదేశం**
**తాజాగా సిట్ ముందు హాజరైన హరీష్ రావు**
**జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణ**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను వేగవంతం చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు తమ ఎదుట హాజరు కావాలని

..మిగతా 3లో




### ఫోన్ ట్యాపింగ్ నేరం కాదు

**దేశం, ప్రజల భద్రత కోసం చేస్తారు**
**అది పోలీసు వ్యవస్థ కనుసన్నల్లోనే జరుగుతుంది**
**ప్రభుత్వానికి కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తారు**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

03

## ధాన్యం దిగుబడి...కొనుగోలులో రికార్డు

**25 ఏండ్లలో రికార్డ్ సృష్టించిన తెలంగాణ**
**డిమాండ్ కు అనుగూణంగా విదేశాలకు ధాన్యం ఎగుమతి**
**ధాన్యం కొనుగోళ్లతో 14.20 లక్షల మంది రైతులకు లబ్ధి**
**బోనస్ తో కలిపి రూ. 18,532.98 కోట్ల మద్దతు ధర చెల్లింపు**
**వరి కొనుగోలులో అగ్రస్థానంలో నిజామాబాద్, నల్లగొండ**
**పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



02

## వడివడిగా ఇండ్లు కట్టుకోండి..

**బిల్లు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదే**
**కొమురం భీం జిల్లాలో భట్టి విక్రమార్క పర్యటన**
**మహిళ సంఘాలకు రూ.3.41 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులు అందజేశారు**
**ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించిన పత్రాలు అందజేశారు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కొమురం భీం జిల్లా జైనూర్ మండలంలోని జంగాం గ్రామంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటించారు. స్వయం సహాయక మహిళ సంఘాలకు

..మిగతా 3లో



## కర్ణాటక అసెంబ్లీలో రగడ.. గవర్నర్ పై ప్రభుత్వం ఆగ్రహం

**ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగం పూర్తిగా చదవకుండానే వెళ్లిపోయిన గవర్నర్**
**గవర్నర్ ను అడ్డుకుంటూ నిలదీసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**
**సరైన నిర్ణయం తీసుకున్నారంటూ గవర్నర్ కు బీజేపీ ఎమ్మెల్యేల మద్దతు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కర్ణాటక అసెంబ్లీలో వివాదం చెలరేగింది. అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ తన ప్రసంగాన్ని రెండు

..మిగతా 3లో


www.prajaswaramdaily.com
WWW.PRAJASWARAMDAILY.COM

## ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు
# భారీ ఎదురుదెబ్బ.

**మొదటిపేజీ తరువాయి**

15 మంది మావోయిస్టులు హతమయ్యారు. సారండా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, సింగ్‌భూం జిల్లాలోని సారండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కోబ్రా బలగాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలపై మావోయిస్టులు కాల్పులకు తెగబడటంతో, బలగాలు దీటుగా ప్రతిఘటించాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోంది. 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సహా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో భద్రతా బలగాలు నిర్మూలన చర్యలను ముమ్మరం చేశాయి. ఝార్ఖండ్‌లో జరిగిన ఈ తాజా ఎన్‌కౌంటర్‌ను కూడా ఈ ఆపరేషన్లలో భాగంగానే అధికారులు చూస్తున్నారు. మృతుల గుర్తింపు, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ ఘటనతో మావోయిస్టుల ఏరివేత దిశగా మరో కీలక ముందడుగు పడినట్లయిందని భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



## రేవంత్ రెడ్డికి, సైబర్ నేరగాడికి
# పెద్ద తేడా లేదు

**మొదటిపేజీ తరువాయి**

ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు మంత్రులను నిలదీస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, దృష్టి మళ్లించేందుకు సిట్ నోటీసులు పంపుతున్నారని విమర్శించారు.

తాను, కేటీఆర్... ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ప్రశ్నిస్తున్నందు వల్లే ఈ చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా భయపడబోమని, హామీల అమలుపై ప్రశ్నించడం ఆపేది లేదని స్పష్టం చేశారు. డైవర్షన్ రాజకీయాలు చేస్తూ నీ బావమరిది కుంభకోణం బయటకు రాకుండా చూడాలనే ప్రయత్నమా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ మంత్రులు వాటాల కోసం కొట్టుకుంటున్నారని, ఆ పార్టీ పని అయిపోయిందని హరీశ్ వ్యాఖ్యానించారు. ప్రజల ముందుకు రావడానికి కాంగ్రెస్ నేతలు జంకుతున్నారని చెప్పారు. “ఎన్ని నోటీసులు ఇచ్చినా భయపడబోం. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేసే వరకూ మీ వెంటపడుతూనే ఉంటాం” అని అన్నారు.



# రోహిత్ శర్మకు డాక్టరేట్

- **టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు గౌరవ డాక్టరేట్**
- **పుణేలోని అజీంక్య డీవై పాటిల్ యూనివర్సిటీ నుంచి సత్కారం**
- **క్రికెట్‌కు చేసిన సేవలకు, నాయకత్వానికి గుర్తింపుగా ఈ పురస్కారం**
- **శనివారం జరగనున్న స్నాతకోత్సవంలో ప్రదానం చేయనున్నారు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

టీమిండియా మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు అరుదైన గౌరవం లభించనుంది. క్రికెట్ రంగానికి ఆయన అందించిన విశేష సేవలు, అద్భుతమైన నాయకత్వ పటిమకు గుర్తింపుగా పుణేలోని అజీంక్య డీవై పాటిల్ యూనివర్సిటీ (ADYPU) గౌరవ డాక్టరేట్ (డాక్టర్ ఆఫ్ లెటర్స్ D.Litt.) ప్రదానం చేయనుంది.

శనివారం జరగనున్న యూనివర్సిటీ 10వ స్నాతకోత్సవంలో రోహిత్ శర్మ ఈ గౌరవాన్ని అందుకోనున్నాడు. వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ అజీంక్య డీవై పాటిల్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగనుంది. క్రీడా రంగంలో రోహిత్ సాధించిన విజయాలు, ప్రపంచ వేదికపై ఆయన కనబరిచిన నాయకత్వ లక్షణాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూనివర్సిటీ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

38 ఏళ్ల రోహిత్ శర్మ ఇప్పటికే టెస్టు, టీ20 ఫార్మాట్‌ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించగా, వన్డే ఫార్మాట్‌లో కొనసాగుతున్నాడు. హిట్‌మ్యాన్ సారథ్యంలోనే భారత జట్టు 2024 టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంది. రోహిత్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు ఐదుసార్లు టైటిల్ అందించి అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు.

గతంలో అర్జున అవార్డు (2015), మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న (2020) వంటి జాతీయ పురస్కారాలు అందుకున్న రోహిత్ కెరీర్‌లో ఈ గౌరవ డాక్టరేట్ మరో మైలురాయిగా నిలవనుంది. ఈ నేపథ్యంలో అభిమానులు, క్రీడా ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా రోహిత్‌కు అభినందనలు తెలియజేస్తున్నారు.

# మినీ ప్రపంచ ఆర్థిక సదస్సుకు హైదరాబాద్ వేదిక

**మొదటిపేజీ తరువాయి**

ప్రారంభించిన సీఐఎఫ్‌ఆర్ (సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్) పురోగతిని కూడా వివరించారు. ఆరోగ్యం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఇది ఆదర్శ మోడల్‌గా గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మూడు జోన్ల అభివృద్ధి నమూనా, క్యూర్-ప్యూర్-రేర్ వ్యూహం, భారత్ ఫ్యూచర్ సిటీ ప్రణాళికను వివరించారు. నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా ఇది దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్‌కు ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, ఫార్మా రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. తెలంగాణ విజన్ లక్ష్యాలు పరస్పర సహకారానికి అనుకూలంగా ఉన్నాయని జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు.

**-భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్..**

తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక పెట్టుబడిని ఆకర్షించింది. యూపీసీ వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి ఏర్పాటు చేసిన ఈ సంస్థ ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడితో భారత్ ఫ్యూచర్ సిటీలో వంద మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ అనుకూల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. నిర్మాణ దశలోనే 3 వేల మందికి పైగా ఉపాధి లభించనుండగా, ప్రారంభం తర్వాత మరో 800 ఉద్యోగాలు కలగనున్నాయి. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడంలో డిజిటల్ మౌలిక వసతులు కీలకమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నెట్-జీరో అభివృద్ధే రాష్ట్ర లక్ష్యమని స్పష్టం చేశారు.

**-శంషాబాద్, గాగిల్లాపూర్‌లో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ..**


శంషాబాద్, గాగిల్లాపూర్‌లో రూ.623 కోట్ల



పెట్టుబడితో స్నైడర్ ఎలక్ట్రిక్ తమ యూనిట్లను విస్తరించనున్నట్లు ప్రకటించింది. సీఎం రేవంత్ రెడ్డి స్నైడర్ సీఈవో దీపక్ శర్మతో భేటీ అయి విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునీకరణ, డిజిటల్ విద్యుత్ నిర్వహణపై చర్చించారు. ఈ విస్తరణతో సర్క్యూట్ బ్రేకర్లు, కాంటాక్టర్లు, పుష్ బటన్ల తయారీ సామర్థ్యం పెరుగనుంది. తెలంగాణ దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా ఎదుగుతోందని అధికారులు తెలిపారు.

# ధాన్యం దిగుబడి...కొనుగోలులో రికార్డు

- **25 ఏండ్లలో రికార్డ్ సృష్టించిన తెలంగాణ**
- **డిమాండ్ కు అనుగుణంగా విదేశాలకు ధాన్యం ఎగుమతి**
- **ధాన్యం కొనుగోళ్లతో 14.20 లక్షల మంది రైతులకు లబ్ది**
- **బోనస్ తో కలిపి రూ. 18,532.98 కోట్ల మద్దతు ధర చెల్లింపు**
- **వరి కొనుగోలులో అగ్రస్థానంలో నిజామాబాద్, నల్లగొండ**
- **పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ధాన్యం దిగుబడితో పాటు ఖరీఫ్ సీజన్ లో కొనుగోళ్లలోనూ తెలంగాణ దేశచరిత్రలోనే ఆల్ టైం రికార్డ్ నమోదు చేసుకుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గడిచిన ఏండ్లలో ఇదే అత్యధిక రికార్డ్ అని ఆయన చెప్పారు. 202526 రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరా శాఖ రూపొందించిన ప్రణాళికలపై గురువారం బేగంపేట ఐ.ఎ.ఎస్.ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్ లో జరిగిన సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల వ్యవదిలో అనుసరించిన విధానాల ఫలితమే ధాన్యం దిగుబడి, కొనుగోళ్లలో సంచలనాత్మక రికార్డ్ నమోదు చేసుకుందని చెప్పారు. పౌరసరఫరాలు, నీటిపారుదల, వ్యవసాయ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకోవడంతో పాటు తెలంగాణ రైతాంగం భాగస్వామ్యంతో ఈ విజయం సాధ్యమైందన్నారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లో లేవన్నారు. 202021 లో నమోదైన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్ ను అధిగమించి తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్ లో71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన తెలంగాణ దేశ చరిత్రలో కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు తొలి సారిగా తమ ప్రభుత్వం అందిస్తున్న బోనస్ తో కలిపి 14.20 లక్షల మంది రైతులకు మొత్తం రూ. 18,532.98 కోట్లు చెల్లించామన్నారు. ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు, సలహాలు, సూచనలను అధికారులు పాటించడంతో పటు ప్రణాళికా రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. రైతులు ఎక్కడ ఇబ్బంది పడకుండా కొనుగోలు ప్రక్రియ ముగిసిందని ఆయన వివరించారు.

**విదేశాలకూ మన ధాన్యం**

అధిక దిగుబడి, రికార్డ్ స్థాయిలో కొనుగోలు చెసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థ కు సరఫరా చేస్తామని మంత్రి చెప్పారు. అదే సమయంలో తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ మార్కెట్ లో ఉన్న డిమాండ్ కు అనుగూణంగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేందుకు రైతులను ప్రోత్సహిస్తామనీ అలాగే అంతర్జాతీయ మార్కెట్ కు బియ్యాన్ని ఎగుమతి చెసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ. 38వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం రికార్డ్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతాంగం విషయంలో అనుసరించిన విధానాలతో సంచలనాత్మక ఫలితాలు సాధించినట్లు వివరించారు. ప్రస్తుతం అర్హులైన నిరుపేదలందరికీ సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుకు నెలకు ఆరు కిలోల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 3.17 కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నామని, చెప్పారు. సన్నబియ్యం పంపిణీ మీద రూ.13,650 కోట్లు ఖర్చు పెడుతున్నట్టు వివరించారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఉన్న నాణ్యతా లోపాలు గుర్తించడంతో పాటు అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలి పోయే విధానానికి కళ్లెం వేసి నాణ్యతా ప్రమాణాలపై కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చామన్నారు.

**మౌలిక సదుపాయాలపై ఫోకస్**

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పెరుగుతున్న నేపధ్యంలో అందుకు అనుగుణంగా నిల్వ చేసేందుకు మౌలిక సదుపాయాల ఆధునీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ధాన్యాన్ని నిల్వచేసే గోదాముల సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకు పరిమితం అయ్యిందన్నారు. కేంద్రప్రభుత్వం సహకారంతో పాటు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో ధాన్యం నిలువ ఉంచే గోదాములను సైలో పద్దతిలో ఆధునికరించే ఆలోచనతో ఉన్నామన్నారు. ఆధునికీకరణతో తేమ శాతం నియంత్రణలో ఉండడంతో పాటు నష్టానివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. ప్రారంభంలో ఆధునీకరణకు ఖర్చు ఎక్కువే అయినప్పటికీ నిల్వ చేసిన బియ్యం చెడిపోకుండా ఉంటే అది ప్రయోజనం కలిగిస్తుందన్నారు. బీహార్ వంటి రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులపై తెలంగాణలో రైస్ మిల్లులు ఆధారపడుతున్నాయనీ ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే వలస వచ్చిన కార్మికులు వారి వారి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని మంత్రి చెప్పారు. ఆ పరిస్థితి తిరిగి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు స్థిరమైన కార్మిక వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు పాటించిన మిల్లర్లకు సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది కూడా రాజకీయ వత్తిళ్లకు లొంగకుండా నిబంధనల అమలులో కఠినంగా ఉండాలన్నారు. డిఫాల్ట్ అయిన మిల్లులకు ధాన్యం కేటాయింపు ప్రసక్తే లేదన్న మంత్రి ,పౌర సరఫరాల శాఖ రూపొందించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాల్సిందేనన్నారు. పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి కనుగుణంగా ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్రంలో మిల్లుల పరిశ్రమని ప్రోత్సహించేందుకు విధివిదానలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా మరిన్ని నిత్యావసర సరుకుల సరఫరాకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందని మంత్రి చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో డ్రైయర్లు ,పాడి క్లినర్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

# బీసీ నేత సీఎం అయ్యే సమయం వస్తుంది

**మొదటిపేజీ తరువాయి**



లభిస్తాయని, అవకాశం ఉన్న ప్రతి చోట బీసీలకు పదవులు ఇస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు.

కష్టపడి పనిచేస్తే ఎవరి వాటా వాళ్లకు దక్కుతుందని, దీనిని ఎవ్వరూ అడ్డుకోలేరని మహేశ్ గౌడ్ అన్నారు. రాబోయే రోజులు అన్నీ బీసీలవే అని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందన్నారు.

ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యలకు ఆయన గట్టి కౌంటర్ ఇచ్చారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేయడం దేశానికి మంచిది కాదని, కులం, మతం పేరుతో మన పిల్లలకు భవిష్యత్తు రాదని వ్యాఖ్యానించారు. రాముడు, అంజనేయుడి పేర్లు చెప్పి బీజేపీ నేతలు ఓట్లు దండుకుంటున్నారని విమర్శించారు. అర్వింద్ ‘జై శ్రీరాం’ అని కాకుండా, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి తాను చేసిన అభివృద్ధి ఏంటో చెప్పి ఓట్లు అడగాలని హితవు పలికారు. రాముని పేరు చెప్పడం తప్ప నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏం చేశారో వివరించాలన్నారు. దేవుళ్లను రాజకీయాలతో ముడిపెట్టవద్దని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# సింగరేణి టెండర్లపై దర్యాప్తు చేపట్టాలి

- **2014 నుంచి ఇప్పటి వరకు టెండర్లపై విచారణ జరగాల్సిందే**
- **సీబీఐనీ రాష్ట్రంలో రానీయకుండా చేసిందెవరూ..?**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో జరిగిన అన్ని టెండర్లపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. నైనీ కోల్ మైన్స్ టెండర్ల కుంభకోణంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా గతంలో నిబంధనలు పెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. అప్పుడు హరీష్ రావు ఏంచేశారని ఆయన ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. సింగరేణి కాలరీస్ సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కలిసి దోచుకున్నాయని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఇప్పుడంటే ఇప్పుడే సింగరేణి అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. పారదర్శకతపై నమ్మకం ఉంటే ప్రభుత్వం ఈ సీబీఐ విచారణకు మొగ్గు చూపాలని సూచించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ వివాదంపై స్పందించిన ఆయన ఈ కంటోన్మెంట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కంటోన్మెంట్ల భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వం త్వరలోనే ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకోబోతోందని రాంచందర్ రావు వెల్లడించారు. స్థానిక ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఈ అడుగు వేయబోతోందని ఆయన పేర్కొన్నారు.

# చేనేత రుణమాఫీ పై రిలే నిరాహార దీక్షలు

**వలిగొండ జనవరి 22 ప్రజాస్వరం**



వలిగొండ మండల కేంద్రంలో గురువారం పద్మశాలి సంఘం మరియు మార్కండేయ సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి చేనేత కార్మికులు పెద్ద ఎత్తున రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు చేనేత నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎన్నికల నేపథ్యంలో రుణమాఫీ వెంటనే మాఫీ చేస్తామని చెప్పి నేటి వరకు రుణమాఫీ చేయలేదని వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగేనే పొదుపు, నేతన్న భరోస పథకానికి నిధులతో పాటు చేనేత కార్మికులకు వర్క్ షెడ్లకు స్థలాలు,నేతన్న అభివృద్ధి కొరకు ప్రభుత్వం నూతన పథకాలను ఏర్పాటు చేసి చేనేతకు బాసత గా నిలవాలని కోరారు. ప్రభుత్వం స్పందించిన ఎడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బడుగు సత్యనారాయణ,పద్మశాలి సంఘం అధ్యక్షులు గంజి వెంకటేశ్వర్లు, పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు సాయిని యాదగిరి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు జెల్ల నరేందర్ (నందు),నామాల జగన్మోహన్, ఎలగందుల లెనిన్, పెండెం విగ్నేష్, వంగరి రమేష్, మిరియాల వెంకటేశం,రాపోలు శ్రీనివాస్, గంజి బాల నరసింహ,ఎక్కలదేవి శ్రీనివాస్,జెల్లనరహరి, రచ్చ సంతోష్, గర్దాసు మనోహర్, ఐటి పాముల మీనయ్య, గుంటి రవీందర్, పారుపల్లి నరసింహ, బోడ కుమార్, మహేశ్వరం చంద్రమౌళి, చిందం యాదగిరి, పసునూరి ప్రభాకర్, బోడ ఈశ్వర్, కర్నాటి వెంకటేశం, చిందం సత్యనారాయణ, సుంకి విక్రమ్, గుంటి రమేష్,కూరపాటి నవీన్, మరియు చేనేత కార్మికులు పాల్గొన్నారు.



# హైడ్రా నెక్స్ట్ టార్గెట్..

- 450 ఏళ్ల కటోరా హౌజ్ పునరుద్ధరణ.!
- గోల్కొండలో 450 ఏళ్ల జలవనరుకు నూతన జీవం
- పర్యాటక, పర్యావరణ పరిరక్షణకు కలిసి చర్యలు
- చారిత్రక జలవనరుల సంరక్షణపై ప్రభుత్వ దృష్టి

హైదరాబాద్, (ప్రజాస్వరం):

హైదరాబాద్ నగరంలోని చారిత్రక వారసత్వాన్ని కాపాడటమే కాకుండా, కనుమరుగవుతున్న జలవనరులకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా హైడ్రా (HYDRAA) తన కార్యకలాపాలను వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా గోల్కొండ కోట ప్రాంగణంలో ఉన్న 450 ఏళ్ల నాటి చారిత్రక జలవనరు 'కటోరా హౌజ్' పునరుద్ధరణకు హైడ్రా తన పూర్తి సహకారాన్ని ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర పురావస్తు శాఖ (ASI) సంరక్షణలో ఉన్న ఈ కటోరా హౌజ్‌ను హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ జలవనరు ప్రస్తుతం చెత్తాచెదారంతో, మురుగునీటితో నిండి ఉండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, దీనిని కాపాడుకోవడానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కటోరా హౌజ్ పునరుద్ధరణ కోసం ముందుకు వచ్చిన 'నిర్మాణ్' అనే ఎన్‌జీవో ప్రతినిధులను రంగనాథ్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ జలవనరును సంరక్షించే ప్రణాళికలో భాగంగా, మొదట ట్యాంక్‌లోకి ఎవరూ చెత్త వేయకుండా చుట్టూ ఎత్తైన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనివల్ల నీటి నాణ్యతను కాపాడటమే కాకుండా, ఆ ప్రాంతం పరిశుభ్రంగా ఉండేలా చూడవచ్చు. అలాగే, సందర్శకులను ఆకట్టుకునే విధంగా జలవనరు చుట్టూ అందమైన పాత్‌వేను (నడక దారి) అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. దీనివల్ల గోల్కొండ సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఇదొక చక్కని ఆధ్యాత్మిక , చారిత్రక అనుభూతిని అందిస్తుంది.

ప్రస్తుతం కటోరా హౌజ్‌లో ఉన్న ప్రధాన సమస్య మురుగునీటి ప్రవాహం. ఈ చారిత్రక జలవనరు గుండా వెళ్తున్న మురుగునీటి పైప్‌లైన్‌కు ప్రత్యామ్నాయ మార్గాన్ని చూడాలని, మురుగు నీరు జలవనరులోకి చేరకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రంగనాథ్ అధికారులకు స్పష్టం చేశారు. చారిత్రక జలవనరుల సంరక్షణ అనేది కేవలం పర్యాటక అభివృద్ధికి మాత్రమే కాకుండా, భూగర్భ జలాల పెంపునకు , నగర వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించడానికి అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ఆర్కియాలజీ శాఖ , ఇతర స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో కటోరా హౌజ్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చే వరకు హైడ్రా పూర్తి స్థాయిలో సహకరిస్తుందని ఈ సందర్భంగా స్పష్టమైంది.

# ఫోన్ ట్యాపింగ్ నేరం కాదు

- దేశం, ప్రజల భద్రత కోసం చేస్తారు
- అది పోలీసు వ్యవస్థ కనుసన్నల్లోనే జరుగుతుంది
- ప్రభుత్వానికి కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తారు
- మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ప్రభుత్వాలకు సంబంధం ఉండదు
- రేవంత్ చెప్పుచేతల్లో 'సిట్'
- కూర్చోమంటే కూర్చుకుంటది... స్టాండ్ అంటే నిలుస్తది
- పాలన గాలికొదిలేసి డ్రామాలాడుతున్నడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, (ప్రజాస్వరం):

ఫోన్ ట్యాపింగ్ నేరమేమి కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. దేశం, ప్రజల భద్రత కోసం ట్యాపింగ్ చేయడం సహజమన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. పోలీసు వ్యవస్థ కనుసన్నల్లోనే అది జరుగుతుందని అన్నారు. ప్రభుత్వానికి కావాల్సిన సమాచారాన్ని తీసుకొచ్చే క్రమంలో పోలీసులు ట్యాపింగ్ చేయడం సహజమన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ప్రభుత్వాలకు సంబంధం ఉండదని తేల్చి చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. గురువారం సిరిసిల్లలో మీడియాతో మాట్లాడారు. ఇది పూర్తిగా ట్రాష్ కేసు.. ఇందులో ఏం ఉండదని కొట్టిపారేశారు. అసలు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందు విచారించాల్సింది ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డినే అని అన్నారు. ఆయనను వదిలేసి మమ్మల్ని పిలిస్తే ఏం వస్తదని ప్రశ్నించారు. ఇప్పుడు ప్రతిపక్షాల ఫోన్‌లను రేవంత్ రెడ్డి కూడా ట్యాపింగ్ చేయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రేపు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తాము విచారణ జరిపిస్తే వీళ్లంతా కూడా జైలుకు పోతారని అన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఇద్దరూ తమ ఫోన్‌లు ట్యాపింగ్‌కు గురవుతున్నాయని అన్నారు. మరి వారి వ్యాఖ్యలపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. హామీల అమలును తప్పించుకోవడానికే సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. సిట్.. రేవంత్ రెడ్డి సిట్ అంటే కూర్చుంటది.. స్టాండ్ అంటే నిల్చుంటదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం పేరుతో కొన్ని రోజులు డ్రామా.. ఈ కార్ రేసు కొన్నిరోజులు, గొర్రెల స్కామ్ అంటూ కొన్ని రోజులు, ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ అంటూ కొన్ని రోజులు డ్రామా చేసి వదిలేస్తారని చెప్పారు. ఒడిశాలోని నైనీ బొగ్గు గని టెండర్ కు సంబంధించిన సింగరేణి కుంభకోణాన్నిబయటపెట్టినందుకే కాంగ్రెస్ ప్రభుత్వం హరీష్ రావుకు, తనకు నోటీసులు ఇచ్చిందన్నారు. , ప్రభుత్వాన్ని అస్థిర పర్చాలనే కుట్రలు ఎవరైనా చేస్తే దాని నుంచి ప్రభుత్వాలను కాపాడటం కోసం 1952(నెహ్రూ కాలం) నుంచి నేటి వరకు నిఘా వ్యవస్థలు చేస్తాయని అన్నారు.




# కర్ణాటక అసెంబ్లీలో రగడ.. గవర్నర్ పై ప్రభుత్వం ఆగ్రహం

మొదటిపేజీ తరువాయి

మాటలతోనే ముగించి సభలో నుంచి వెళ్లిపోయారు. ఉపాధి హామీ పథకంపై కేంద్రానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని గెహ్లాట్ చదవలేదు. దీంతో గవర్నర్ గెహ్లాట్ తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపడుతుండగా.. బీజేపీ ఎమ్మెల్యేలు గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ సమర్థిస్తున్నారు.

**అసలు ఏం జరిగిందంటే..**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ప్రసంగించాల్సి ఉంది. సాధారణంగా ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగం కాపీని గవర్నర్ సభలో చదువుతారు. ఈ సంప్రదాయం మేరకు సిద్ధరామయ్య ప్రభుత్వం గవర్నర్ కు ప్రసంగం కాపీ అందించింది. అయితే, అందులో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి చేసిన మార్పులను వ్యతిరేకించింది. కేంద్రం తీరుకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని ఈ ప్రసంగం కాపీలో ప్రస్తావించింది. దీనిని చదివేందుకు నిరాకరించిన గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్.. సింపుల్ గా 'రాష్ట్రం ప్రగతి మార్గంలో నడుస్తోంది.. సమావేశాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ ప్రసంగాన్ని ముగించేశారు. ఆపై సభలో నుంచి వెళ్లిపోతుండగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని సీఎం సిద్ధరామయ్య కూడా గవర్నర్ పై మండిపడ్డారు.

అయితే, కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాసిచ్చిన ప్రసంగాన్ని చదవకూడదని గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ బీజేపీ ఎమ్మెల్యేలు సమర్థించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అవమానించాలన్న కాంగ్రెస్ కుటిల ప్రయత్నాన్ని సరిగ్గా తిప్పికొట్టారంటూ గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర కొనియాడారు. గవర్నర్ పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రవర్తనకు సీఎం సిద్ధరామయ్య క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.





# ఫోన్ ట్యాపింగ్ లో కేటీఆర్ కు నోటీసులు

మొదటిపేజీ తరువాయి

నోటీసుల్లో పేర్కొన్నారు. నందినగర్ లోని కేటీఆర్ నివాసంలో ఈ నోటీసులు అందించారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఇప్పటికే సిట్ ఎదుట హాజరయ్యారు. జూబ్లిహిల్స్ ఏసీపీ ఆఫీసులో కేటీఆర్ ను ప్రశ్నించనున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, జడ్జీల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలపై ఈ దర్యాప్తు సాగుతోంది. జనవరి 20న జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విచారణలో హరీష్ రావు సుమారు 78 గంటల పాటు సిట్ అధికారుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా సిట్ అధికారులు అడిగిన ప్రశ్నల్లో పసలేదని, తనను కావాలనే ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని హరీష్‌రావు విమర్శించారు. అయితే, సాంకేతిక ఆధారాలు మరియు అరెస్టయిన పోలీసు అధికారుల వాంగ్మూలాల ఆధారంగా విచారణ ప్రక్రియను మరింత లోతుగా నిర్వహించాలని సిట్ నిర్ణయించింది.

సజ్జనార్ నేతృత్వంలోని సిట్ సమగ్ర విచారణ ప్రస్తుతం ఈ కేసులో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు, డీఎస్పీ ప్రణీత్ రావు వంటి వారు ప్రధాన నిందితులుగా ఉన్నారు. వీరి విచారణలో వెలుగు చూసిన విషయాల ఆధారంగానే రాజకీయ నేతలకు నోటీసులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే రోజుల్లో ఈ విచారణ ఎటు దారితీస్తుందో, ఎవరికి కొత్తగా నోటీసులు అందుతాయో అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరమైన అంశంగా మారింది. కేసును సజ్జనార్ నేతృత్వంలోని సిట్ తీసుకున్నప్పటి నుండి మరింత దూకుడుగా విచారణ జరుపుతున్నారు.

లొట్టపీసు కేసుగా లైట్ తీసుకుంటున్న కేటీఆర్

కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ కేసును ఒక లొట్టపీసు కేసు గా కొట్టిపారేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే పాత కేసులను మళ్లీ మళ్లీ తోడుతున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యంగా నైనీ కోల్ బ్లాక్ వంటి భారీ కుంభకోణాలను బీఆర్ఎస్ ఎండగడుతున్న తరుణంలో, తమను డిఫెన్స్‌లో పడేయడానికే ప్రభుత్వం ఈ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని గంటలు విచారించినా చివరకు ఇందులో తేలేది ఏమీ ఉండదని, ఇది కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యే తప్ప ఇందులో వాస్తవం లేదని కేటీఆర్ బలంగా వాదిస్తున్నారు. పోలీసుల నోటీసులకు స్పందించి ఆయన విచారణకు హాజరయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

## బైరీ నవీన్ గౌడ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి...

కాప్రా, జనవరి(ప్రజాస్వరం):



కాప్రా సర్కిల్ పరిధిలోని డా. ఏఎస్ రావు నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్ జన్మదిన వేడుకలు ఎల్లారెడ్డిగూడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బైరీ నవీన్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి బైరీ నవీన్ గౌడ్ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ప్రజలతో నిత్యం మమేకమై పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామ్ లల్లా ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా ప్రసాద వితరణ...

- రెండేళ్ల రామ్ లల్లా ప్రతిష్ఠ వేడుకలు.. కాప్రాలో భక్తి వెల్లువ

కాప్రా,జనవరి 22(ప్రజాస్వరం):

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిరంలో రామ్ లల్లా ప్రతిష్ఠకు రెండేళ్లు పూర్తైన సందర్భంగా కాప్రా సర్కిల్ పరిధిలోని కమలానగర్ సత్తిరెడ్డి గల్లీలో భక్తి శ్రద్ధలతో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. స్థానిక వ్యాపార సంస్థల యాజమాన్యాలు, వ్యాపారులు పరస్పర సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టగా, ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా శ్రీరాముని చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద మంత్రోచ్చారణలు, రామనామ జపంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. రామ్ లల్లా ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా ఈ తరహా సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల యువతతో పాటు ప్రజల్లో భక్తి భావనలు మరింత బలపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం శాంతియుతంగా, క్రమబద్ధంగా సాగేందుకు స్థానికులు సహకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, దుకాణాల యాజమాన్యాలు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# వడివడిగా ఇండ్లు కట్టుకోండి..

మొదటిపేజీ తరువాయి

రూ.3.41 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సంద్భంగా భట్టి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే కాదు వారం వారం బిల్లు ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ధిదారులు ఏ ఒక్కరోజు ఆలస్యం చేయకండి. వడివడిగా ఇండ్లు కట్టుకోండి.. బిల్లు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిదే అని భట్టి తెలిపారు. నీటి పారుదల సమస్యలు అడిగారు. అప్పుడు బ్రిడ్జి అడిగారు. వాటి పనులు పూర్తి చేసే పనిలో ఉన్నామన్నారు. ఓజా కళాకారుల కళ ఎంతో గొప్పది అని కొనియాడారు.

కళాకారులను ఆదుకుంటాం అని అండగా ఉంటామని చెప్పాను. అందులో భాగంగా మీ ఓజా కళను కాదుకోవడం కోసం రుణాలు ఇచ్చే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందిరమ్మ చీరలు కట్టుకొని మహాలక్ష్మి ల్లాగా ఉన్నారు.. మహిళలకు ఇప్పటికే రూ.26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. మహిళల్ని కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. మీరు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే మేము డబ్బులు కడుతున్నామని తెలిపారు. నాడు వెయ్యి రూపాయలు లేని పరిస్థితిలో ఉన్న మహిళను నేడు బస్సులకు ఓనర్లను చేశాం.. చెప్పినట్టుగానే ధరణి తీసి భూ భారతి తెచ్చామని భట్టి తెలిపారు.



కొమరం భీం ప్రాజెక్ట్ కెనాల్ కాలేదు అన్నారు.. వారికి ప్రపోజల్స్ పంపారు.. పనులు త్వరలో ప్రారంభం చేస్తామని హామీ ఇచ్చారు. దొడ్డు బియ్యం స్థానం లో సన్న బియ్యం ఇస్తున్నాం.. 96 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చాం. విద్యుత్ శాఖ అధికారులు పొలం బాట, ప్రజా బాట పట్టారు. మీ సమస్యలు పరిష్కారం చేస్తారు. వారిని కలవండని గ్రామస్తులకు సూచించారు. 108 తరహాలో విద్యుత్ సమస్యల పైన 1912 ను సంప్రదించండి విద్యుత్ సమస్యలను పరిష్కారం చేస్తారని అన్నారు. మీ ప్రాంత సమస్య లను పరిష్కారం కోసం ఓ అంబులెన్స్ వస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు.



## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాక ఐటిసి పిఎస్పీడీ కర్మాగారంలో భద్రతా లోపాలు మరోసారి స్పష్టమయ్యాయి

**బూర్గంపాడు జనవరి 22(ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాక ఐటిసి పిఎస్పీడీ కర్మాగారంలో భద్రతా లోపాలు మరోసారి స్పష్టమయ్యాయి గురువారం కర్మాగారంలోని చెప్పరాసు విభాగంలో జరిగిన ఘోర ప్రమాదంలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డారు ఈ ఘటన స్థానికంగా కలకాలం రేపింది విశ్వాసనీయ సమాచారం ప్రకారం ఐటిసి కర్మాగారంలో యువిఆర్ కాంట్రాక్ట్ కింద భద్రాచలానికి చెందిన ఒక వ్యక్తి క్యాజువల్ కార్మికుడిగా విధుల్లో చేరాడు. చిప్పర్ హౌస్ విభాగంలో పనిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కన్వేయర్ బెల్ట్ లో పడిపోయాడు ఈ భయానక ఘటనలో సదరు కార్మికుడి కాలు పూర్తిగా విరిగిపోయి తీవ్ర రక్తస్రావం అయింది అత్యవసర స్థితిలో ఉన్న బాధితుడిని తోటి కార్మికులు బయటకు తీయగా మెరుగైన చికిత్స నిమిత్తం వెంటనే హైదరాబాద్ కు తరలించినట్లు తెలుస్తోంది.

**యాజమాన్యంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు**

ఐటీసీ కర్మాగారంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు కార్మికుల భద్రతపై నీలి నీడలు కొమ్ముకునేలా చేస్తున్నాయి. అయితే ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్న యాజమాన్యం మాత్రం వాటిని బయటకు పొక్క కుండ జాగ్రత్త పడుతోందని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వకుండా అంతర్గతంగా బాధితులతో లేదా కాంట్రాక్టర్లతో సెటిల్ చేస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి భద్రత నియమాలు పాటించడంలో కాంట్రాక్టు సంస్థలు విఫలమవుతున్న ఐటిసి ప్రధాన యాజమాన్యం పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తుందని కార్మికులు మండిపడుతున్నారు. ఐటీసీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో పనిచేసే సామాన్య కార్మికులకు రక్షణ లేకుండా పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుడి కాలు విరిగి ప్రాణాపాయ స్థితికి చేరుకున్న యాజమాన్యం అధికారికంగా స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి ఎప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కర్మాగారంలో జరుగుతున్న ప్రమాదాలపై విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇకపై ఆన్లైన్ ద్వారానే ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా

- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 'మన ఇసుక వాహనం' పైలట్ ప్రాజెక్ట్ అమలు : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**బూర్గంపాడు,జనవరి 22(ప్రజాస్వరం):**






తెలంగాణ రాష్ట్రంలో ఇసుక రవాణా, సరఫరా వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా, నియంత్రిత విధానంలో అమలు చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సాండ్ మేనేజ్మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, అవినీతి వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ కొత్త విధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న ఈ విధానాన్ని ముందుగా పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర గనులు & భూగర్భ శాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (TGMDC) అధికారులు సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న తహసిల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ వ్యవస్థ పని విధానం, ఇసుక బుకింగ్ విధానం, రవాణా అనుమతులు, జీపీఎస్ ట్రాకింగ్, చెల్లింపుల విధానం, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇకపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సిస్టమ్ ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ నిర్మాణ పనులు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సహా అన్ని అవసరాల కోసం మాన్యువల్ కూపన్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి అనుమతి, ప్రతి రవాణా, ప్రతి లావాదేవీ పూర్తిగా ఆన్లైన్ విధానంలోనే జరుగుతుందని, ఇందులో ఎలాంటి మానవ జోక్యం ఉండదని అన్నారు.

మండలాల వారీగా ఇసుకకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా తక్షణమే ఇసుక లభ్యత ఉన్న రీచ్‌లను గుర్తించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన రీచ్‌ల వివరాలు, రవాణా సామర్థ్యం, రోజువారీ సరఫరా వివరాలను సమగ్రంగా ఏడి మైన్స్ కార్యాలయానికి నివేదించాలని సూచించారు. తద్వారా ఇసుక కొరత లేకుండా ప్రజలకు సకాలంలో సరఫరా చేయవచ్చని తెలిపారు.ఈ కొత్త విధానం సమర్థవంతంగా అమలవ్వాలంటే అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తాసిల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలు సహా జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికారులు ఈ వ్యవస్థపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందారని, ఫీల్డ్ స్థాయిలో కూడా పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా, నిల్వలు, ధరల పెంపు వంటి అంశాలపై కఠిన నియంత్రణ చర్యలు అమల్లోకి వస్తాయని హెచ్చరించారు .ఈ ఆన్లైన్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగంగా, నమ్మకంగా, అవినీతి రహితంగా ఇసుక లభ్యత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు.

ఈ అవగాహన సదస్సులో ఏ డి మైనింగ్ అధికారులు, పిఓ-టి జి యం డి సి, సి జి జి (హైదరాబాద్) ప్రతినిధులు, మండల స్థాయి తహసిల్దార్లు, ఎంపిడివోలు, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## సిఎం కప్ క్రీడా పోటీలకు జీడిమెట్లలో ర్యాలీని ప్రారంభించిన ఎంఈఓ

**కుత్బుల్లాపూర్, జనవరి 22:(ప్రజాస్వరం)**

జీడిమెట్ల ముఖ్యమంత్రి కప్ (CM CUP) క్రీడా పోటీల ప్రచారంలో భాగంగా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్లలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆధ్వర్యంలో సిఎం కప్ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి (MEO) జెమినీ కుమారి, జెడ్పీహెచ్ఎస్ జీడిమెట్ల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్ అరుణ జ్యోతి పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని వారు పేర్కొన్నారు. సిఎం కప్ పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాల్సిందిగా సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో జట్టు భావన, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ ర్యాలీలో జెడ్పీహెచ్ఎస్ జీడిమెట్ల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, సీఆర్పీలు (CRPs)తో పాటు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ జీడిమెట్ల పరిసర ప్రాంతాల్లో కొనసాగి క్రీడల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించింది.





## దక్షిణ భారత సైన్స్ ఫెస్టివల్‌లో మదర్స్ ల్యాప్ విద్యార్థుల ప్రతిభ.

- **'స్పేస్ ఆఫ్ వీల్స్' ప్రాజెక్టుకు జాతీయ స్థాయి గుర్తింపు.**

**వనపర్తి,జనవరి 22 (ప్రజాస్వరం):**

మదర్స్ ల్యాప్ హైస్కూల్ విద్యార్థులు దక్షిణ భారత సైన్స్ ఫెస్టివల్-2026లో తమ ప్రతిభను చాటుకొని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్న విద్యార్థులు, వినూత్న ఆలోచనలతో నిపుణులను ఆకట్టుకున్నారు. విద్యార్థులు రూపొందించిన 'స్పేస్ ఆఫ్ వీల్స్' ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతరిక్ష విజ్ఞానాన్ని సాధారణ భావనలతో మేళవిస్తూ రూపొందించిన ఈ ప్రాజెక్టును వారు శాస్త్రీయ స్పష్టతతో, ఆత్మవిశ్వాసంతో వివరించడంతో నిపుణులు ప్రశంసల వర్షం కురిపించారు. ఇది విద్యార్థుల పరిశోధనా దృష్టి, సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త రఘునందన్ మార్గదర్శకత్వంలో జరగగా, ఆయన విద్యార్థుల ప్రదర్శనను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే కార్యక్రమానికి హాజరైన ఇస్రో శాస్త్రవేత్త శాఫాలి విద్యార్థుల ప్రతిభను మెచ్చుకుంటూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

పాఠశాల ప్రిన్సిపాల్ ముబీన్‌తో పాటు గైడ్ టీచర్ ఫిర్దౌస్ అందించిన నిరంతర ప్రోత్సాహం, సమగ్ర మార్గనిర్దేశం వల్లే ఈ విజయం సాధ్యమైందని నిర్వాహకులు తెలిపారు. సరైన శిక్షణతో పాటు ప్రాయోగిక విజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వడమే ఈ ఘన విజయానికి మూలకారణమని పేర్కొన్నారు.

ఈ విజయం మదర్స్ ల్యాప్ హైస్కూల్‌కు గర్వకారణంగా నిలవడమే కాకుండా, విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని మరింత పెంచిందని విద్యావేత్తలు తెలిపారు. భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనల వంటి రంగాల వైపు అడుగులు వేయడానికి ఇది ప్రేరణగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.





## మెరిట్ విద్యార్థులకు కెఎల్ యూనివర్సిటీ 100 కోట్ల స్కాలర్‌షిప్... బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి గడ్డం వివేక్

**కుత్బుల్లాపూర్ జనవరి 22.(ప్రజాస్వరం)**

బౌరంపేటలో కెఎల్ యూనివర్సిటీ లో ప్రతియేట అకాడమిక్ ఇయర్ మెరిట్ విద్యార్థుల కోసం అందించే కెఎల్ యూనివర్సిటీ 100కోట్ల స్కాలర్ షిప్ బ్రౌచర్ ను రాష్ట్ర లేబర్&మైనింగ్ జియాలజీ మంత్రి గడ్డం వివేక్ ఆవిష్కరణ చేశారు. కెఎల్ హెచ్ యూనివర్సిటీ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి మంత్రి గడ్డంవివేక్ తో కలిసి కళాశాల డైరెక్టర్లు,ప్రిన్సిపాల్ లు జ్యోతి ప్రజ్వాళన చేసి వ్యక్తిత్వ వికాసంఉన్నత విలువలు అనే అంశంపై ప్రసంగించారు. కెఎల్ఎచ్ యూనివర్సిటీ పేద,మెరిట్ విద్యార్థుల కోసం తీసుకున్న ఈ 100కోట్ల స్కాలర్షిప్ నిర్ణయాన్ని అభినందించారు.కళాశాలలో నేర్చుకున్న చదువుతో పాటు క్రమశిక్షణ మాత్రమే జీవితంలో ఉన్నతస్థాయికి తీసుకెళ్లగలుగుతుందని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఒకొక్క ఇన్స్టిట్యూట్ లో గవర్నమెంట్ తరుపున కుడా విద్యార్థులను ప్రోత్సహించి స్కిల్స్ ను డెవలప్ చేసే దిశగా 250కోట్లను మంజూరు చేస్తున్నామన్నారు..తెలంగాణ లో ముఖ్యంగా ప్రతి కుటుంబానికి విద్యవైద్యంపైనే ఎక్కువ ఖర్చు అవుతుందని దీనిలో భాగంగానే పేద ప్రజలకు ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశ్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా 5నుండి 10లక్షలకప స్లాబ్ లను మార్చమని,ఏదేమైన ఉన్నత విద్యను అందించాలనే సదుద్దేశంతో ఉన్న ఇలాంటి యూనివర్సిటీలు లు తెలంగాణకు అవసరమని ఇలాంటి యూనివర్సిటీల వల్లే పిల్లలకు మంచి భవిష్యత్తు,ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కె ఎల్ యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.



## మల్లాపూర్‌లో వీధి దీపాల కోసం వినతి...

**కాప్రా, జనవరి 22(ప్రజాస్వరం):**

ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో మాణిక్చంద్ రోడ్డు నుంచి నాచారం రోడ్డు వరకు వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నెమలి అనిల్ కుమార్ తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఆయన సంబంధిత పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి సంస్థ అధికారులను కలిసి వీధి దీపాల ఏర్పాటు కోరుతూ వినతి పత్రం అందజేశారు. రాత్రి వేళ ప్రమాదాలు, భద్రతా సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు.



## చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు.!

**జనవరి 22 (ప్రజాస్వరం):**

చిన్నచింతకుంట మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా రూ.14,40,520 ఆదాయం సమకూరినట్లు ఈఓ మదనేశ్వర్ రెడ్డి, పరిశీలకులు శ్రీనివాస్ తెలిపారు. భక్తులు సమర్పించిన ఈ కానుకలను ఆలయ అభివృద్ధి, భక్తుల వసతుల కల్పన కోసం వినియోగిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గోవర్ధన్ రెడ్డి కమలాకర్ భాస్కర్ చారి గోపాల్ నాగరాజు భారతమ్మ చక్రవర్ధన్ రెడ్డి ఆలయం అర్చకులు వెంకటయ్య సత్యానారాయణ విజయ్ లక్ష్మీ నరసింహ ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు ఆలయ సిబ్బంది సేవ సమితి భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజల భాగస్వామ్యంతో
# రోడ్డు భద్రత సాధ్యం

- రామాయంపేట్‌లో అవగాహన కార్యక్రమం
- 100 హెల్మెట్ల పంపిణీ, బైక్ ర్యాలీ నిర్వహణ
- హాజరైన జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు, మెదక్ ఎమ్మెల్యే రోహిత్



**రామాయంపేట, జనవరి 22, (ప్రజాస్వరం ) :**

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని స్కూల్ గ్రౌండ్‌లో 100 హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులు పాల్గొని, అనంతరం స్కూల్ గ్రౌండ్ నుండి వినాయక ఫంక్షన్ హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత పై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం రామాయంపేట్ వినాయక ఫంక్షన్ హాల్‌లో స్కూల్ మరియు కాలేజ్ విద్యార్థులకు భారీ ఎత్తున రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్ , మెదక్ ఎమ్మెల్యే శ్రీ రోహిత్ ముఖ్య అతిథులుగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సగటున దాదాపు 27 వేల రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, అందులో సుమారు 7500 మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. గత ఏడాది సుమారు 800 మంది హత్యలకు గురైతే, అదే కాలంలో రోడ్డు ప్రమాదాల్లో సుమారు 7500 మంది మరణించారని, అంటే హత్యలకన్నా పది రెట్లు ఎక్కువ మంది రోడ్లపై ప్రాణాలు కోల్పోతున్నారన్న విషయం తీవ్ర ఆందోళనకరమని అన్నారు. 2025లో ప్రమాదాల సంఖ్య పెరిగినప్పటికీ, మృతుల్లో 80 శాతం మంది ద్విచక్ర వాహనదారులే ఉండటం ఆందోళనకరమని, ముఖ్యంగా యుక్త వయసు యువత ఎక్కువగా ప్రాణాలు కోల్పోతుండటం బాధాకరమని తెలిపారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ స్ట్రాప్ సరిగ్గా బిగించుకోవాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం చేయరాదని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని హెచ్చరించారు.రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, స్టాప్ లైన్ దాటడం, హైవేలపై ఆటోలు నడపడం, ఓవర్‌లోడింగ్, హైబీమ్ లైట్లు వాడడం, ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేయడం వంటి ఉల్లంఘనలే ప్రమాదాలకు ప్రధాన కారణాలని స్పష్టం చేశారు.అదే విధంగా, రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు వెంటనే సహాయం అందించిన వారికి ప్రభుత్వం నుండి నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని, ప్రజలు ముందుకొచ్చి బాధితులను ఆదుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రజలు వాహనాలు సురక్షితంగా వాహనాలు నడిపి తమ గమ్యాన్ని స్థానలను చేరుకోవాలని, దేశ వ్యాప్తంగా 4లక్షల ఆక్సిడెంట్ లు జరుగుతున్నాయాని అందులో 1లక్ష 50 వెల మంది వరకు మరణిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థులకు వారి తల్లీదండ్రులు రోడ్డు నియమాలు పాటించేలా కృషి చేయాలని అన్నారు. చివరగా విద్యార్థులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ శ్రీ నరేందర్ గౌడ్, రామాయంపేట్ ఇన్‌చార్జ్ సీఐ శ్రీ రంగా కృష్ణ, ఆర్టీఓ శ్రీ వెంకట స్వామి, జిమ్మెర్ ప్రతినిధి శ్రీమతి షాలిని, మేనేజర్, ఎస్ఐ బాలరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేయాలి



**మాసాయిపేట, ప్రజాస్వరం :**

గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని మాసాయిపేట ఎంపీడీవో విఘ్నేశ్వర్ సూచించారు. కొత్తగా గెలుపొందిన సర్పంచులతో అధికారుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామాల

## క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం



**మాసాయిపేట, ప్రజాస్వరం :**

గ్రామీణ స్థాయిలో ఉన్న మట్టి లో మాణిక్యాలాంటి క్రీడాకారులను వెలికితీసి వారి ప్రతిభను ప్రపంచ స్థాయి కి పరిచయం చేసే ఉద్దేశం తో తెలంగాణ ప్రభుత్వం మరియు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న సి ఎం కప్ 2025 లో భాగంగా మాసాయిపేట గ్రామ స్థాయి క్రీడలను మాసాయిపేట గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచ్ శ్రీ వీరన్నగారి కృష్ణా రెడ్డి వాలీబాల్ క్రీడలను సర్వీస్ చేసి ప్రారంభించారు. గ్రామ స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేలా చేయడానికి ఇలాంటి క్రీడలు ఉపయోగపడతాయని శ్రీ కృష్ణ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శ్రీ పసుల వెంకటేష్ , వార్డు సభ్యులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,క్రీడాకారులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంచినీటి పైపు లైన్ కోసం భూమి పూజ

**తూప్రాన్, జనవరి 22 (ప్రజాస్వరం) :**

మనోహరాబాద్ మండలం మేజర్ గ్రామపంచాయతీ అయినా కాళ్లకల్ లో మిషన్ భగీరథ మంచినీటి పైపు లైన్ కోసం వివేకానంద పాఠశాల కాలనీలో పైపులైను కు భూమి పూజ చేసిన సర్పంచ్ నవ్య నాగరాజ్ గౌడ్ ఉప సర్పంచ్ ప్రవీణ్ కుమార్ AWE దివ్య పంచాయతీ కార్యదర్శి ప్రియాంక పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు






## ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

**తూప్రాన్, జనవరి 22 (ప్రజాస్వరం) :**

తూప్రాన్ మున్సిపాలిటీలోని పదో వార్డులో అర్హులైన లబ్ధిదారులకు గురువారం ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్లను అందజేసిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి.తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో నర్సారెడ్డి మాట్లాడుతూ కొద్దిరోజుల్లోనే దరఖాస్తు చేసుకున్న అర్హులైన వితంతు వికలాంగుల పెన్షన్లు మంజూరు అయితాయాన్ని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి సత్యనారాయణ శంకర్ గౌడ్ లబ్ధిదారులుతదితరులు పాల్గొన్నారు

## తూప్రాన్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ



**తూప్రాన్, జనవరి 22 (ప్రజాస్వరం ) :**

తూప్రాన్ మున్సిపాలిటీలోని 12వ వార్డు 16వ వార్డులో రేషన్ షాప్ ల వద్ద ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా చీరల పంపిణీ విషయము తెలుసుకున్న మహిళలు రేషన్ షాప్ కు భారీగా చేరుకున్నారు కార్యక్రమంలో మున్సిపల్ రిసోర్స్ పర్సన్ విజయ రెడ్డి కాంగ్రెస్ నాయకులు తుమ్మెద శ్రీనివాస్ యాదవ్ అజార్ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జీఎంఆర్‌ను కలిసిన ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్



**పటాన్‌చెరు, జనవరి 22(ప్రజా స్వరం) :**

ఇంద్రేశం మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా నియమితులైన అజయ్ రెడ్డి గురువారం పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో అభివృద్ధి, పౌర సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పారదర్శక పాలనకు కట్టుబడి పనిచేయాలని ఆదేశించారు.

## పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు

- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు



**మెదక్, జనవరి 22 (ప్రజా స్వరం) :**

బాధితుల గౌరవం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రవేశపెట్టిన కొత్త విధానాన్ని మెదక్ జిల్లాలో అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాలికలు, మహిళలు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లే సమయంలో వేధింపులకు గురవుతున్న అనేక సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో చాలా మంది బాధితులు భయంతో, మానసిక ఒత్తిడితో ఫిర్యాదు చేయలేకపోతున్నారని తెలిపారు. ఇలాంటి వారికి అండగా నిలిచేందుకే పోలీస్ శాఖ ఈ కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు, బాలికలు, పిల్లలు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనయ్యే బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇంటివద్ద నుంచే ఫిర్యాదు చేసుకునే అవకాశం రాష్ట్ర పోలీస్ శాఖ కల్పించిందని తెలిపారు. ప్రత్యేక సందర్భాల్లో పోలీసులే బాధితుల ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తారని వివరించారు. బిఎన్ఎస్ఎస్ నిబంధనల ప్రకారం నేర సమాచారం అందిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ సహా ఏ రూపంలోనైనా కేసు నమోదు చేయాల్సి ఉంటుందని, బాధితుల గౌరవానికి భంగం కలగకుండా సేవలు అందించడమే ఈ విధాన ప్రధాన లక్ష్యమన్నారు. ఈ విధానం దేశంలోనే తొలిసారిగా అమలులోకి వస్తోందని, దీని ద్వారా బాధితులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. మహిళలు, పిల్లలపై నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, శారీరక దాడులు, ర్యాగింగ్, బాల్య వివాహాల నిషేధ చట్టం కేసులు వంటి ప్రత్యేక నేరాల్లో ఈ ఎస్ఓపి అమలు చేస్తామని తెలిపారు. బాధితులు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే వెంటనే స్పందించి, పోలీసులే ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాపీని బాధితులకు అందజేస్తారని చెప్పారు. అవసరమైన సాక్ష్యాల సేకరణ, వాంగ్మూలాల నమోదు కూడా అక్కడికక్కడే చేపడతామని స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో ఈ విధానం పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని నేరాలపై భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## గురుకులాల్లో దరఖాస్తులకు ఆహ్వానం

**పటాన్‌చెరు, జనవరి 22 ప్రజా స్వరం :**

రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో బీసీ,ఎస్సీ, ఎస్టీ ఏడాదికి సీట్లు భర్తీకి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువు జనవరి, 25 వరకు గడువు పొడిగించారు. బీసీ గురుకుల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో 2026 27 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్ లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బీసీ గురుకుల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల అల్లాదుర్గ్, ఐనోల్ ప్రిన్సిపాల్ బి.స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి కూడా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్రవంతి తెలిపారు. అర్హత పరీక్ష ఆధారంగా విద్యార్థుల సీట్ల ఎంపిక జరుగుతుందని అన్నారు. కావున అర్హత కలిగిన బీసీ,ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య పౌష్టికాహారం, యూనిఫామ్, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా అందించనున్నమని కావున అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 25వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ స్రవంతి కోరారు.

## మల్కాపూర్ అభివృద్ధిపై రాజస్థాన్ అధికారుల అధ్యయనం



**తూప్రాన్, జనవరి 22 (ప్రజాస్వరం) :**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామాన్ని రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన స్వచ్ఛభారత్ మిషన్ జాయింట్ డైరెక్టర్ మురళి లాల్ శర్మ, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేష్ కమల్ లు సందర్శించారు.అభివృద్ధి పై అధ్యయనం చేశారు గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, రాక్ గార్డెన్, అంగన్వాడి, ఇంకుడు గుంతలను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీలో పలు రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ సిబ్బంది వేతనాలు, ప్రతిరోజు నిర్వహించే పని కార్యక్రమాలపై ఆరా తీశారు. అలాగే ఇంకుడు గుంతల పనితీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి విచ్చేసిన అధికారులను సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో SLWM స్టేట్ అధికారి టివిఎం సూర్య, సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, ఏపీవో సంతోష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ లు సురేష్, సత్యం, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనగర సంకీర్తనకు ఘన స్పందన



• పాల్గొన్న ఈర్ల రాజు

**అమీన్ పూర్, జనవరి 22(ప్రజా స్వరం) :**
అయోధ్యలో శ్రీ రాముడి ప్రాణ ప్రతిష్ఠను స్మరించుకుంటూ బీరంగూడలో జనవరి 22న నిర్వహించిన శ్రీ రామ నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో జరిగింది. పటేల్ గూడా, బీరంగూడ పరిధిలోని హనుమాన్ దేవాలయాల ఆధ్వర్యంలో భక్తులు రామభజనలు ఆలపిస్తూ ఊరేగింపుగా ముందుకు సాగారు. వందనాపురి రామాలయం వద్ద పట్టు వస్త్రాల సమర్పణతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కార్యకర్త ఈర్ల రాజు ముదిరాజ్ పాల్గొని భక్తులతో కలిసి రామస్మరణలో పాల్గొన్నారు. పని రోజు అయినప్పటికీ పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావడం విశేషం.

# క్లాసిక్ దాబాపై దాడి.. అద్దాలు ధ్వంసం



**తూప్రాన్ జనవరి 22 (ప్రజా స్వరం) :**
మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కళ్ళకాల్ శివారులో వారిలో గల క్లాసిక్ దాబాపై కొందరు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది మనోహరాబాద్ గ్రామస్తులు టి స్టాల్‌లో సెల్ఫ్ సర్వీస్ ఉండగా సర్వే చేయాలంటూ బెదిరించి స్టాల్ పై దాడి చేసి వ్యక్తి ని కొట్టారు అంతటి తో ఆగకుండా దాబాలో ఉన్నా చొరబడి అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం చేశారు .పోలీసులు రంగంలో కి దిగి దాడి చేసిన వారిని అక్కడి నుంచి చెదరగొట్టారు. దాబా యాజమాన్యంపై దాడి చేసిన వ్యక్తులపై చట్టరిత్య చర్యలు తీసుకొని నష్ట పరిహారం ఇప్పించాలని పోలీసులను దాబా యజమానులు కోరారు.

# ఎరువుల పత్రం పంపిణీ ప్రారంభం



• ఏవో రాజనారాయణ

**రామాయంపేట, జనవరి 22, ( ప్రజాస్వరం ) :**
మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో పంట వేసిన ప్రతి రైతుకు మరియు తమ విస్తీర్ణం ఆధారంగా ఎరువుల పంపిణీ పాదదర్శకంగా పంపిణీ లక్ష్యంగా ఎరువుల పంపిణీ పత్రాల ద్వారా ఎరువులను ముఖ్యంగా యూరియా పంపిణీ ఈరోజు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాజనారాయణ మాట్లాడుతూ, "ఇప్పటి నుండి యూరియా కావాల్సిన రైతులు తప్పనిసరిగా ఎరువుల పంపిణీ పత్రం కలిగి ఉండాలి. ఈ పత్రం ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ చేయబడుతుంది" అని తెలిపారు. రైతులు ఎరువుల పంపిణీ పత్రం తీసుకొని, యాసంగి సీజన్‌లో వేసిన పంట విస్తీర్ణం వివరాలు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో పాటు నమోదు చేసుకొని, వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారి ద్వారా ధ్రువీకరించుకోవాలని సూచించారు.వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఈ విధానం గురించి అవగాహన కల్పించడం జరిగింది.మరిన్ని వివరాలకు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించండి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు



# జిల్లా కేంద్రంలో పదో తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు

• కృషి చేసిన మెదక్ ఎంపీకి తపస్ ధన్యవాదలు

**చేగుంట, జనవరి 22 ( ప్రజాస్వరం ) :**
ఎంపీ రఘునందన్ రావు గారి చొరవతో మెదక్ జిల్లా కేంద్రంలో పదవ తరగతి మూల్యాంకన కేంద్రం మంజూరు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు గారిని కలిసి, మెదక్ జిల్లా కేంద్రంలో పదవ తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటుకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. వెంటనే ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకొని ఎడ్యుకేషన్ సెక్రెటరీ నవీన్ నికోలస్ గారికి ఫోన్ ద్వారా సంప్రదించారు. స్పందించిన నవీన్ నికొలస్ మెదక్ జిల్లా కేంద్రంలో పదవ తరగతి మూల్యాంకన కేంద్రాన్ని మంజూరు చేయిస్తున్నట్లు ఎంపీ గారికి సమాచారం ఇచ్చారు. ఇట్టి విషయాన్ని పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ధ్రువీకరించారు. మెదక్ జిల్లా చిరకాల కోరిక అయినటువంటి పదవ తరగతి మూల్యాంకన కేంద్రం మెదక్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం పట్ల తపస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జలా సిద్దు, తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్, మన్నే వెంకట్ స్వామి,జిల్లా నాయకులు తిరునగిరి నర్సిములు, మార్గం రాజు,బిక్షపతి, మల్లేశం, మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.



# తూప్రాన్ ఎస్సైకి లారీ యూనియన్ సన్మానం

**తూప్రాన్, జనవరి 22( ప్రజా స్వరం) :**
తూప్రాన్ నూతన ఎసైగా బాధ్యతలు చెపట్టిన వి. గంగారాజును తూప్రాన్ లారీ యూనియన్ నాయకులు గురువారం రోజు పోలీస్ స్టేషన్ లో శాలువా కప్పి సన్మానించారు లారీ యూనియన్ అధ్యక్షులు రేపల్లె రాజు రాము పంతులు ప్రతాప్ రెడ్డి శేరిఫ్ తదితరులు ఉన్నారు.

# నిధుల దుర్వినియోగంపై విచారణ

• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**రామాయంపేట, జనవరి 22, ( ప్రజాస్వరం ) :**
మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగం పై వస్తున్న ఆరోపణలపై విచారణ చేపించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను కోరిన మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు గారు. ఈ ఆరోపణలపై నిజా నిజాలు తేల్చేందుకు జిల్లా ఆడిట్ ఆఫీసర్ ను విచారణ అధికారిక నియమించిన జిల్లా కలెక్టర్. గత రెండు సంవత్సరములు గా మున్సిపాలిటీకి సంబంధించిన పనుల ఖర్చుల వివరాలు ఆర్థిక లావాదేవీలు వాటిపై జిల్లా ఆడిట్ అధికారి ద్వారా



వాస్తవ, అవాస్తవాలకు అనుగుణంగా పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించవలసిందిగా ఆదేశించారు.

# అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం




**తూప్రాన్, జనవరి 22 (ప్రజా స్వరం) :**
మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ పట్టణంలోని డైలీ మార్కెట్ ప్రాంతంలో ప్రజలకు రోడ్డు భద్రత నిబంధనల గురించి తూప్రాన్ ఎస్ఐ గంగరాజు ఎస్సై 2 జ్యోతి పోలీసు సిబ్బంది తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కూరగాయల కు సంబంధించిన వారు జాగ్రత్తలు తీసుకొని వారి యొక్క సరకులను సురక్షితంగా గమ్య స్థానాలకు రవాణా చేసుకోవడం విషయం గురించి అలాగే ప్రతీ వాహనదారులు హెల్మెట్ సీటు బెల్ట్ ఖచ్చితంగా పెట్టుకొని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రతిఒక్కరు సురక్షితంగా గమ్యం చేరాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వాహనదారులు తూప్రాన్ పుర ప్రజలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం



**రామాయంపేట జనవరి.22 (ప్రజాస్వరం) :**
మెదక్ జిల్లా రామయంపేట పట్టణంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ జర్నలిస్టు కమ్మరీ వెంకట రాములు ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆయనకు ఆర్థిక సహాయం అందించడానికి లీలా గ్రూపు చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ ముందుకు వచ్చారు. బుధవారం నాడు ఆయన రాష్ట్ర టీయూడబ్ల్యుజే iju రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి . జి.శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో రాములు ఇంటికి వెళ్లి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టియుడబ్ల్యూజే కోశాధికారి ఊడేం దేవరాజు,రామాయంపేట ప్రెస్క్లబ్ ప్రధాన కార్యదర్శి రాము, సభ్యులు బల్ల యాదగిరి, గజ్జల రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999